


ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

మద్యం మత్తు చంపేసింది..

● కారు, ఇద్దరు రైతులు.. ఆపై లారీని ఢీకొన్న స్కార్పియో ● బార్లపల్లె వద్ద ఘోర రోడ్డు ప్రమాదం ● ఐదుగురు దుర్మరణం.. మరో ఇద్దరి పరిస్థితి విషమం



కారు ప్రమాదంలో మృతి చెందిన తిలక్, చంద్రయ్య, శ్రీనాథ్ మృతదేహాలు



విక్రమ్ ఫైల్‌ఫోటో

సుబ్రమణ్యం

తిలక్ ఫైల్‌ఫోటో

శ్రీనాథ్ ఫైల్‌ఫోటో

మదనపల్లె, అర్బన్, ఫిబ్రవరి 25: మద్యం మత్తు, అతివేగం అయిదుగురి ప్రాణాలను పొట్టన పెట్టుకుంది. పార్టీ చేసుకోవడానికి స్నేహితులతో కలసి స్కార్పియో వాహనంలో కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు వెళ్లారు. అక్కడ ఫుల్‌గా మద్యం తాగారు. మదనపల్లెకు తిరిగి వస్తూ సరిహద్దు ప్రాంతం చీకలబైలు వద్ద కారును ఢీకొన్నారు. కంగారులో అక్కడి నుంచి వేగంగా వస్తూ మార్గమధ్యలో మదనపల్లె-బెంగళూరు ప్రధాన రహదారి బార్లపల్లె వద్ద ఆదివారం రాత్రి 7-8 గంటల మధ్యలో ఇద్దరు రైతులను ఢీకొన్నారు. ఈ క్రమంలో మరింత కంగారు, భయాందోళనకు గురైన యువత ప్రయాణిస్తున్న స్కార్పియో మరింత స్పీడు పెరిగింది. అంతే కొంతదూరం వెళ్లాక ఎదురుగా వస్తున్న బోరు లారీని ఢీకొంది. ప్రమాదంలో స్కార్పియోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించగా, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. మరొకరికి ఇక్కడే చికిత్స అందిస్తున్నారు. ఊహించని రీతిలో జరిగిన ఈ ఘోర ప్రమాదం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇందులో స్కార్పియో వాహనం నుజ్జునుజ్జు కాగా, ముగ్గురి మృతదేహాలు మాంసం ముద్దల్లాగా తయారయ్యాయి. వాహనం నడుపుతున్న వ్యక్తి తల ఎగిరి లారీలో ఇరుక్కుపోగా, మరొకరి కాలు కట్ అయి వేరుగా పడింది. మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. కర్ణాటక వైపు నుంచి స్కార్పియో వస్తుండగా, మదనపల్లె నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న లారీని వీరు ఢీకొన్నారు. లారీకి కుడివైపున ధ్వంసం కాగా స్కార్పియో వాహనం నుజ్జునుజ్జయింది. ప్రమాద ఘటన తెలుసుకున్న ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఆర్డీవో హరిప్రసాద్, తాలూకా సీఐ ఎన్.శేఖర్‌లు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలు, క్షతగాత్రులను జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మదనపల్లె పట్టణం, పరిసర ప్రాంతాలకు చెందిన ఆరుగురు యువకులు పార్టీ చేసుకోవడానికి ఆదివారం సాయంత్రం కర్ణాటక సరిహద్దు ప్రాంతం రాయల్‌పాడుకు స్కార్పియోలో బయలుదేరారు. ఇందులో మదనపల్లె పట్టణం తట్టివారిపల్లెకు చెందిన టి.చిన్నరెడ్డెప్ప కుమారుడు టి.శ్రీనాథ్ (25), అమ్మచెరువుమిట్టకు చెందిన టి.మల్లికార్జున కుమారుడు టి.తిలక్ (18) దేవతానగర్‌కు చెందిన సి.చలపతి కుమారుడు సి.విక్రమ్ (37)లు దుర్మరణం చెందారు. అలాగే ఇదే వాహనంలో ప్రయాణిస్తున్న రామారావు కాలనీకి చెందిన జి.నాగరాజ కుమారుడు జి.హరీష్, నీరుగట్టువారిపల్లెకు చెందిన జి.సోమశేఖర్ కుమారుడు జి.చరణ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక జిల్లా ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు వీరిని తిరుపతికి రెఫర్ చేశారు. నీరుగట్టువారిపల్లెకు చెందిన కె.వెంకటరమణ కుమారుడు కె.మహేష్‌కు ప్రాణాపాయస్థితి నుంచి బయట పడటంతో జిల్లా ఆసుపత్రిలోనే చికిత్స చేస్తున్నారు. అంతకుముందు ఇదే స్కార్పియో వాహనం మదనపల్లె-బెంగళూరు ప్రధాన రహదారిపై బార్లపల్లె వద్ద ఢీకొన్న ప్రమాదంలో కోళ్లవారిపల్లెకు చెందిన రైతులు చంద్రయ్య (45), సుబ్రహ్మణ్యం (కాశీదాసు) (55) అక్కడికక్కడే మృతి చెందారు. రోడ్డుపై పాల డెయిరీ యజమానికి పాలుపోసి ఇంటికి వెళ్తుండగా, వేగంగా వచ్చిన స్కార్పియో ఇద్దరినీ ఒకేసారి ఢీనడంతో మృత్యువాత పడ్డారు.

అమెరికాకు వెళ్లాలని పార్టీకి ఆహ్వానించి..

● స్థానిక దేవతానగర్‌కు చెందిన సి.చలపతి కుమారుడు సి.విక్రమ్ ఎనిమిదేళ్ల క్రితం ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లాడు. అతడికి అమెరికా ప్రభుత్వం గ్రీన్‌కార్డు కూడా జారీ చేసింది. ఇదిలావుండగా అయిదునెలల క్రితం స్వగ్రామం మదనపల్లెకు వచ్చాడు. అయిదు రోజుల్లో తిరిగి అమెరికాకు వెళ్లాల్సి ఉండగా స్నేహితులతో కలసి ఆదివారం మధ్యాహ్నం పట్టణంలో విందు ఏర్పాటు చేశారు. తర్వాత అదే స్నేహితులతో మందు పార్టీ చేసుకోవడానికి రాయల్పాడు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఇతడికి చెందిన సొంత స్కార్పియో వాహనంలో వెళ్లారు. అతడే వాహనం డ్రైవింగ్ చేసినట్లు స్నేహితులు చెబుతున్నారు.

● తట్టివారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప కుమారుడు టి.శ్రీనాథ్ స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఓపక్క చదువుకుంటూనే మిలటరీలో ఉద్యోగం చేయాలనే తపన ఎక్కువగా ఉండేది. ఇందులో భాగంగా నాలుగురోజుల క్రితం తిరుపతికి వెళ్లి సీఆర్‌పీఎస్ ఎంట్రన్స్ రాసి వచ్చినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈయన తండ్రి చిన్నరెడ్డెప్ప మున్సిపాలిటీలో శానిటరీ వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

● అమ్మచెరువుమిట్టకు చెందిన టి.మల్లికార్జున కుమారుడు టి.తిలక్ (18) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటూ క్వారీలకు రిగ్గుతో రంధ్రాలు వేసే పనిచేస్తున్నాడు. తండ్రి చేతిమగ్గాలతో పాటు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

ఆసుపత్రిలో ఆర్తనాదాలు

ప్రమాద ఘటన దావానలంలా వ్యాపించడంతో బాధితుల కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు పెద్దఎత్తున జిల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. దీంతో ఆసుపత్రి ఆవరణం కిక్కిరిసిపోయింది. మృతుల కుటుంబీకులు చేసిన ఆర్తనాదాలు చూపరులను కలచివేశాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, తెలుగు యువత అధ్యక్షుడు జి.శ్రీరామ్ చినబాబు, విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ ఎన్.సేతు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిస్సార్ అహ్మద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్లు జిల్లా ఆసుపత్రికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోదిస్తున్న మృతుల బంధువులు, క్షతగాత్రులను పరామర్శించారు. మొదట ఆసుపత్రికి చేరిన ముగ్గురి మృతదేహాలను నాయకులే దగ్గరుండి అంబులెన్స్ నుంచి మార్చురీకి తరలించే ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ వైద్యసిబ్బందికి ఫోన్ చేసి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

బార్లపల్లె వద్ద స్థానికుల ధర్నా

స్కార్పియో ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన బార్లపల్లె వద్ద రైతులు, స్థానికులు ధర్నా చేశారు. కర్ణాటక నుంచి నిత్యం తాగుబోతులు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి చేస్తున్నా పోలీసులు, అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ముఖ్యంగా ఆదివారం రోజున ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేస్తున్నా..మద్యం బాటిళ్లను మాత్రమే చూస్తున్నారని, మద్యం తాగిన వాహనం నడిపిన వారిని గుర్తించి పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరంటూ ప్రశ్నించారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే మృతదేహాలను ఇక్కడి నుంచి తీసుకెళ్లేందుకు ఒప్పుకుంటామని అక్కడే కూర్చున్నారు. తర్వాత ఎస్పీ, డీఎస్పీ, ఆర్డీవోలు అక్కడికి చేరుకుని వారి డిమాండ్లను అంగీకరించడంతో మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించడానికి అంగీకరించారు.



ఆసుపత్రి ఆవరణలో బాధితుల ఆక్రందనలు

జంగాలపల్లెలో చిరుత సంచారం

● మేకను పట్టుకున్న చిరుత ● భయాందోళనలో గ్రామ ప్రజలు



చిరుత దాడిలో గాయపడిన మేక

సిద్దవటం, ఫిబ్రవరి 25: సిద్దవటం మండలం జంగాలపల్లె దళితవాడలో శనివారం అర్ధరాత్రి చిరుత సంచరించింది. భాగమ్మ అనే మహిళకు చెందిన పూరి గుడిసెలో ఉన్న మేకల మందపై దాడి చేసి మేకను నోట కరవడంతో, శబ్దాలు విన్న భాగ్యమ్మ, బంధువులు లేచి చూడగా మేకను ఈడ్చుకొని వెళుతున్న చిరుత కనిపించింది. వారి కేకలు విని వచ్చిన గ్రామస్థులు చిరుతను అడవిలోకి తరిమి వేశారు. చిరుత దాడిలో గాయాలపాలైన మేకకు స్థానిక వెటర్నరీ వైద్యశాలలో చికిత్స చేయించామని భాగ్యమ్మ తెలిపింది. ఈ విషయంపై సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి వివరణ కోరగా చిరుత దాడిలో గాయపడ్డ మేకను పరిశీలించామని, వన్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

సతీష్‌రెడ్డిని కలిసిన బీటెక్ రవి



వేంపల్లె, ఫిబ్రవరి 25: ఎన్నో ఏళ్లుగా టీడీపీలో కలిసి కష్టపడి పనిచేశాం, పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం వచ్చింది. పార్టీ గెలుపునకు సహకరించాలని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డిని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి కోరారు. టీడీపీకి రాజీనామా చేసి నాలుగు సంవత్సరాలకు పైగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న సతీష్‌రెడ్డిని శనివారం వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ సురేష్‌రెడ్డితో కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో అలర్ట్ అయిన బీటెక్ రవి ఆదివారం ఉదయం సతీష్‌రెడ్డిని వేంపల్లెలోని ఆయన ఇంట్లో కలిశారు. సుమారు గంటపాటు మాట్లాడారు. పార్టీలోకి తిరిగి రావాలని.. అందరం కలిసి పనిచేద్దామని.. ఈ విషయంపై చంద్రబాబునాయుడుతో కూడా మాట్లాడుతామని సతీష్‌రెడ్డికి బీటెక్ రవి తెలిపినట్లు తెలిసింది. రెండు మూడు రోజుల్లో కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని సతీష్‌రెడ్డి బీటెక్ రవికి తెలిపారు. త్వరలో కార్యకర్తలతో సమావేశం అయ్యేందుకు సతీష్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

సతీష్‌రెడ్డిని కలిసిన పుత్తా: వేంపల్లెలో ఉన్న శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డిని కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి కలిశారు. ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో సతీష్‌రెడ్డి ఇంటికి పుత్తా వెళ్లి సుమారు గంటకుపైై ఏకాంతంగా చర్చలు జరిపి పార్టీలోకి తిరిగి రావాలని సతీష్‌రెడ్డిని కోరినట్లు తెలిసింది.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

● రాయచోటిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ కృష్ణారావు



మదనపల్లెలో బూట్లు వేసుకున్న అభ్యర్థులను బూట్లు తీయించి తనిఖీలు చేస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 25: జిల్లాలో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్ర్కీనింగ్ టెస్ట్ రాత పరీక్షలు పటిష్ట బందోబస్తు మధ్య జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల రాజు మెయిన్ స్కూల్‌లో జరిగిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రూప్-2 పరీక్ష సందర్భంగా జిల్లాలోని రాజంపేట, రాయచోటి, మదనపల్లె, పీలేరు పట్టణాల్లో 14 పరీక్షా కేంద్రాల్లో జరిగిన గ్రూప్-2 పరీక్షల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు ముగ్గురు డీఎస్పీలు, 6 మంది సీఐలు, 9 మంది ఎస్ఐలతో పాటు 30 మంది ఏఎస్ఐలు, హెచ్‌సీలు, 65 మంది కానిస్టేబుళ్లు, 16 మంది మహిళా పోలీసు కానిస్టేబుల్స్ కలిపి 175 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలోని మదనపల్లె, రాజంపేట, పీలేరు, రాయచోటి పట్టణాల్లోని పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు 6 రూట్స్‌లో మొబైళ్లు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14 పరీక్షా కేంద్రాల్లో 7,425 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేశారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నారు.

మదనపల్లెలో ఐదు సెంటర్లు..

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 25: గ్రూప్-2 పరీక్షల్లో భాగంగా మదనపల్లెలో ఐదు సెంటర్లలో 3200 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 24 గదుల్లో 700 మంది, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో 20 గదుల్లో 500 మంది, శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో 32 గదుల్లో 700 మంది, శ్రీకృష్ణారెడ్డి జూనియర్ కళాశాలలో 20 గదుల్లో 500 మంది, శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాలలో 20 గదుల్లో 500 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించడంతో పాటు చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశాకే లోపలికి అనుమతించారు. కాగా ఏపీపీఎస్సీ బోర్డు సభ్యుడు జీవీ సుధాకర్‌రెడ్డి, ఆర్డీవో హరిప్రసాద్‌తో కలసి పట్టణంలోని ఐదు సెంటర్లలో పరీక్ష తీరుతెన్నులను పరిశీలించారు. ఇదిలా ఉండగా పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ముగ్గురు అభ్యర్థులు వారి సెంటర్లను గుర్తించలేక తికమకపడుతుండటంతో టూటౌన్ సీఐ యువరాజు వారు ముగ్గురిని తన జీపులో ఎక్కించుకుని అభ్యర్థులకు కేటాయించిన సెంటర్ల వద్ద వదిలి పెట్టారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

రాజంపేటలో ప్రశాంతంగా..

రాజంపేట, ఫిబ్రవరి 25: రాజంపేటలో గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచే గ్రూప్-2 పరీక్షలు రాసే విద్యార్థులు ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 565 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 365 మంది హాజరు కాగా 200 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశారు. కంట్రోలర్ ఎగ్జామినర్ ఎం.మారుతిప్రసాద్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ టిఎన్ రంగనాధన్, అన్నమాచార్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ పరీక్షా ఏర్పాట్లను చేశారు. భారీ బందోబస్తు మధ్య ఈ రాత పరీక్షలు జరిగాయి.



రాయచోటిలోని రాజు మెయిన్ స్కూల్‌లో గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ కృష్ణారావు



రాజంపేటలో పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

సీమ రైల్వే స్టేషన్లకు మహర్దశ!

● అమృత్ భారత్ పథకంలో 13 స్టేషన్ల ఎంపిక ● రూ.127.67 కోట్లతో రైల్వేస్టేషన్ల ఆధునీకీకరణ ● కడప రైల్వేస్టేషన్‌కు అత్యధికంగా రూ.20.35 కోట్లు ● అన్నమయ్య జిల్లాలో సీటీఎం, రాజంపేట స్టేషన్‌ల ఎంపిక ● నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని

కలికిరి, ఫిబ్రవరి 25: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ పథకంలో భాగంగా ఆధునికీకరణ కోసం రాయలసీమలో 13 రైల్వేస్టేషన్లు ఎంపికయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం వాటికి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. గతేడాది ఫిబ్రవరిలో కేంద్రం అమృత్ భారత్ పథకాన్ని ఆచరణలోకి తెచ్చింది. వందే భారత్ రైళ్లకు ఉన్నత స్థాయి వర్గాల నుంచి మంచి ఆదరణ లభించిన విషయం తెలిసిందే. ఇక ద్వితీయ శ్రేణి వర్గాలకు కూడా అందుబాటులో ఆధునిక వసతులతో కూడిన రైళ్లను నడపాలని అమృత్ భారత్ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. సాధారణ ప్రయాణీకుల కోసం ఆధునిక వసతులతో రైళ్ల వేగాన్ని గరిష్ఠంగా పెంచడం, బోగీల్లో సాంకేతికత జోడించిన సదుపాయాలు, ప్రధానంగా అమృత్ భారత్ స్టేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది కావలసిన వసతులను సమకూర్చడం అమృత్ భారత్ పథకం ప్రధాన ఉద్దేశాలు. వీటికి అనుగుణంగా బోగీల్లో భద్రతా ప్రమాణాలను పెంచనున్నారు. ఇక రైల్వేస్టేషన్లలో సౌకర్యవంతమైన వెయిటింగ్ హాళ్లు, అందుబాటులో వైఫై సదుపాయం, ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజీలు, తాగునీటి కియోస్కీలు, పరిశుభ్రమైన ఆధునిక మరుగుదొడ్లు తదితర వసతులను అమృత్ భారత్‌కు ఎంపికైన స్టేషన్లలో అభివృద్ధి చేయనున్నారు. ఇక అమృత్ భారత్ రైళ్లలో గరిష్ఠంగా 22 నాన్ ఏసీ కోచ్‌లుంటాయి. ఈ రైళ్లన్నింటినీ ఎక్స్‌ప్రెస్ రైళ్లగానే పరిగణిస్తారు. అవసరమైన రూట్లలో డిమాండును బట్టి ఏసీ కోచ్‌లను జత చేస్తారు. సాధారణ కోచ్‌లలో కూర్చుని ప్రయాణం చేయడమే కాకుండా త్రీ టయర్ పడకలు కూడా వుంటాయి. గరిష్ఠంగా గంటకు 130 కి.మీ. వేగంతో ఇవి నడుస్తాయి. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వందే భారత్ రైళ్లకు దీటుగా అమృత్ భారత్ రైళ్లు కూడా రాయలసీమలో పట్టాలెక్కనున్నాయి. అదే విధంగా ఈ రైళ్లకు అనువుగానే కొన్ని ముఖ్యమైన రైల్వేస్టేషన్లను కూడా భారీ ఖర్చుతో ఆధునికీకరించనున్నారు.





రాయలసీమలో ఎంపికైన స్టేషన్లు

గతేడాది ఆగస్టులో రాష్ట్రానికి 18 అమృత్ రైల్వేస్టేషన్లు మంజూరు కాగా అందులో రాయలసీమకు రూ.42.60 కోట్లతో కేవలం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ ఒక్కటే మంజూరైంది. తాజాగా రెండు రోజుల క్రితం రాష్ట్రానికి మొత్తం రూ.613.30 కోట్లతో 34 అమృత్ రైల్వే స్టేషన్లు మంజూరు కాగా అందులో రాయలసీమకు రూ.127.67 కోట్లతో 13 స్టేషన్లు దక్కాయి. డోన్, ఆదోని, మంత్రాలయం, కర్నూలు, అనంతపురం, కదిరి, మదనపల్లె రోడ్డు (సీటీఎం), పాకాల మార్గంలో తిరుపతికి ఒక రూటు, అదే విధంగా కర్నూలు, కడప, రాజంపేట మార్గంలో మరో రూటు అమృత్ రైళ్లు నడపడానికి మార్గం సుగమమైంది. ఆదోని రైల్వేస్టేషన్ ఆధునిక వసతులతో కూడిన పునర్వ్యవస్థీకరణకు (రూ.10.26 కోట్లు), అనంతపురం (రూ.9.29కోట్లు), చిత్తూరు (రూ.13.99 కోట్లు), ధర్మవరం (రూ.7.14 కోట్లు), డోన్ రూ.(8.64 కోట్లు), గుత్తి (రూ.10.81 కోట్లు), కడప (రూ.20.35 కోట్లు), సీటీఎం (రూ.8.01 కోట్లు), నంద్యాల (రూ.10.6 కోట్లు), మంత్రాలయం రూ.(3.58 కోట్లు), పాకాల (రూ.7.28 కోట్లు), రాజంపేట (రూ.5.93 కోట్లు), శ్రీకాళహస్తి (రూ.11.79 కోట్లు) స్టేషన్లు ఎంపికయ్యాయి.

విద్యార్థులు ఫుల్.. ఉపాధ్యాయులు నిల్

● ఇద్దరు ఉండాల్సిన పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ● పాఠ్యాంశాల బోధనకు ఇబ్బందులు ● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

నందలూరు, ఫిబ్రవరి 25: ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటేనే ఐదు తరగతులకు బోధన కష్టతరం. కానీ విద్యార్థులు ఫుల్.. ఉపాధ్యాయులు నిల్ అన్న కోణంలో మండలంలోని పలు పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఏకోపాధ్యాయుల వల్ల మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు పాఠ్యాంశాల బోధనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఐదు తరగతులు గల ప్రాథమిక పాఠశాలలైన చాపలవారిపల్లెలో 38 మంది విద్యార్థులు, కుందా నెల్లూరులో 22 మంది, టంగుటూరు ఉర్దూలో 22, గట్టుమీదపల్లెలో 23, ఎర్రచెర్లోపల్లె గ్రామంలో 38, ఆడపూరులో 22, నందలూరు హరిజనవాడలో 23, అరవపల్లె ఉర్దూలో 22, పాటూరు యానాది కాలనీలో 21 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు.

ఈ పాఠశాలల్లో కేవలం ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. 21 మంది విద్యార్థు లు ఉంటే ఆ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండా లి. కానీ దాదాపు తొమ్మిది పాఠశాలల్లో కేవలం ఒకే ఉపాధ్యాయుడితో పాఠాలు బోధించడం కష్టతరంగా మారింది. పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు సాధారణంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతారు. దీనికి ప్రధాన కారణం విద్యతో పాటు పలు రకాల (మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్కులు, ఇతర సదుపాయాలు) ఉచిత వసతులు ఉండటం. కానీ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామంటున్న ప్రభుత్వా లు ఆ దిశగా సౌకర్యాలు కల్పించడంలో విఫలం చెందుతున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం నాడు-నేడు పనుల ద్వారా విద్యార్థులకు ఎన్నో వసతులు కల్పిస్తామన్న ప్రభుత్వం, ఆ సౌకర్యాలను నెరవేర్చడంలో అలసత్వం వహిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం అన్నమయ్య జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన అభిషిక్త్ కిశోర్ పోలింగ్ బూత్‌ల పరిశీలనలో భాగంగా వైసీపల్లె ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఆ సమయంలో విద్యార్థులు 'మాకు టీచర్ కావాలి సార్' అని కలెక్టర్‌ను కోరిన సంఘటన చోటు చేసుకుంది.

అక్షరాస్యతతోనే గ్రామంతో పాటు రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నది అక్షర సత్యం. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు విలువైన విద్యను అందించడం ప్రభుత్వాల బాధ్యత అని, ఇప్పటికైనా 22 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని మండలంలోని పలువురు తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



టీచర్ కావాలి సార్ అని కలెక్టర్‌ను కోరుతున్న విద్యార్థులు (ఫైల్)





38 మంది విద్యార్థులు ఉన్న వై.సి.పల్లె పాఠశాల, 22 మంది విద్యార్థులు ఉన్న అరవపల్లె ఉర్దూ పాఠశాల

నాణ్యమైన విద్యకు ఉపాధ్యాయులు అవసరం



విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం ఎంతో అవసరం. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండాలి. కానీ మండలంలోని పలు పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడితో పాఠాలు బోధించడం వల్ల పిల్లలకు సరైన విద్య అందదు. సీఎం జగన్ గొప్పలు పలకడం మాని టీచర్ల కొరతను తీర్చాలి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఐదు తరగతులు ఉండే ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకనుగుణంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలి.

- రేవూరి వేణుగోపాల్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విద్యార్థులకు తగిన ఉపాధ్యాయులు ఉండాలి



విద్యార్థులకు తగిన ఉపాధ్యాయులు ఉంటేనే పాఠాలు బోధించడం సులభతరం అవుతుంది. ఐదు తరగతులు ఉండి ఒక ఉపాధ్యాయుడు ఉంటే అన్ని తరగతుల పాఠాలు బోధించడం ఎలా సాధ్యం. నందలూరు అరుంధతివాడలోని ప్రాథమిక పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉంటే ఒకే ఒక టీచర్ ఉన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారి ఉన్నతి కోసం, ప్రభుత్వం తగినంత మంది టీచర్లను ఏర్పాటు చేయాలి.

- మోడపోతుల రాము, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు, నందలూరు

చిట్వేలిలోనూ ఉపాధ్యాయుల కొరత

చిట్వేలి, ఫిబ్రవరి 25 : పాలకులు విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామంటూ చెబుతున్నా అది అమలుకు నోచుకోవడం లేదు. తాంబూలాలు ఇచ్చాం.. పెళ్లికి రండి అన్న చందంగా నాడు-నాడు కింద పాఠశాలలను అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్నపాలకులు విద్యార్థుల విద్య పట్ల ప్రాధాన్యం చూపడం లేదు. చాలాచోట్ల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూరిబా, 58 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అధికారులు కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు క్రీడలకే దూరమవుతున్నారు. ఇందులో చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు కొరతగా ఉంది. పోలోపల్లిలో 2, వెంకటరాజుపల్లెలో ఇద్దరు ఉపాధ్యాయులు, కె.కందులవారిపల్లెలో ప్రధానోపాధ్యాయుడితో పాటు పీ.టీ.ఉపాధ్యాయుడి కొరత వేధిస్తోంది. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. వసతులు మాత్రం అంతంత మాత్రమే ఉన్నాయి. పాఠశాలలో విద్యార్థులకు ఆడుకోవడానికి క్రీడా మైదానం అడవిని తలపిస్తూ ఉంది. పరిస్థితిని గమనించిన చిట్వేలి సీహెచ్ఎస్ హెల్ప్‌లైన్ సొసైటీ సభ్యులు విద్యార్థులకు క్రీడా మైదానాన్ని తయారు చేసి ఇచ్చారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన కాస్మొటిక్స్, ఇతర వస్తువులు ఇవ్వవలసినవి రాలేదు.



చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో ఒకే రూమ్‌లో అన్ని తరగతుల విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలో...

మండలంలో ప్రాథమిక పాఠశాలలు 58 ఉండగా 88 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే ఏ పాఠశాలలోనూ విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఇందులో మండల వ్యాప్తంగా 30 మంది ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో 57 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు గానూ ఒక్కరే ఉపాధ్యాయుడు పిల్లలకు విద్యను అందిస్తున్నారు. పరిస్థితిని గమనించిన గ్రామానికి చెందిన బాలకృష్ణయాదవ్, మరికొందరు తల్లిదండ్రులతో కలిసి మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం ఇచ్చారు. గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో వేలల్లో ఉన్న ఫీజులు కట్టలేక, గ్రామాల్లో ఉన్నత పాఠశాలలకు పంపుతున్న తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గురువుల పట్ల, విద్యార్థుల పట్ల ఏమీ పట్టనట్లు ఉన్నారని విమర్శలు వినబడుతున్నాయి.

ఆర్భాటాలు తప్ప విద్యార్థుల సమస్యలు పట్టవా..

పాలకులు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు, విద్యార్థుల భవిష్యత్తును మాత్రం అంధకారంలోకి నెట్టేస్తున్నారు. 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇద్దరు ముగ్గురు ఉండాల్సిన ఉపాధ్యాయులు ఒకరు మాత్రమే ఉంటున్నారు. రాష్ట్రంలో ఉన్న సమస్యకు ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. సకాలంలో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రభుత్వం నిర్వహించి ఉంటే రాష్ట్రంలో నేడు ఈసమస్య ఉండేది కాదు. ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు కట్టలేక చాలా గ్రామాల్లో పిల్లలను ఇంటి దగ్గరే ఉండిపోతున్నారు. వెంటనే ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



చెన్నకేశవరెడ్డి (ఫైల్)

చక్రాయపేట, ఫిబ్రవరి 25: మండలంలోని కె.రాజుపల్లెకు చెందిన చెన్నకేశవరెడ్డి (22) అనే యువకుడు విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నకేశవరెడ్డి నెల్లూరులో సీఏ చదువుతూ మూడురోజుల కిందట ఇంటికి వచ్చాడు. గ్రామం సమీపాన పొలాల్లోకి అతని తండ్రి నీరుపాగట్టేందుకు వెళ్లాడు. తండ్రికి అన్నం పెట్టిరావాలని తల్లి చెప్పింది. అన్నం తీసుకొని చెన్నకేశవరెడ్డి పొలం వద్దకు వెళ్లాడు. అంతలో అతని తండ్రి కరెంటు వచ్చిందేమో స్టార్టర్ వద్దకెళ్లి ఆన్‌చేయమన్నాడు. అక్కడ వైర్లు తెగిపడి ఉండడం అతను గమనించలేదు. వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందగా ఎంతసేపటికి రాకపోవడంతో తండ్రి అక్కడికి వెళ్లాడు. అప్పటికే వైర్లు తగిలి కిందపడిఉన్నాడు. ఎదిగిన కొడుకు చనిపోవడంతో కుటుంబం దిగ్భ్రాంతిచెందింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏపీపీఆర్ ఎంఈఏ నూతన కమిటీ ఎన్నిక

కడప(రూరల్) ఫిబ్రవరి 25 : ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా శాఖ ఎన్నికలు ఆదివారం జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ ఆఫీసర్‌గా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రత్యేక పరిశీలకుడిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆర్.నాగిరెడ్డిలను రాష్ట్ర సంఘం ఏర్పాటు చేసింది. ఈ ఎన్నికల్లో ఇటీవల నూతనంగా ఎన్నికైన 12 సమితుల యూనిట్ సభ్యులతో పాటు కడప జిల్లా పరిషత్ యూనిట్ సభ్యులు హాజరై 21 మందితో కూడిన జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రెండవ పర్యాయం లంకా మల్లేశ్వర్‌రెడ్డిని ఎన్నుకోగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సి.శ్రీనివాసులరెడ్డిని, అసోసియేషట్ అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులరెడ్డి, ట్రెజరర్‌గా జి.యాదర్థ భాస్కర్, ఉపాధ్యక్షుడిగా జి.రమేష్, ఎం.గోపీనాథ్, కె.ఎం.దస్తగిరిని ఎన్నుకున్నారు. అలాగే స్టేట్ కౌన్సిలర్స్‌గా ఎం.రామనాగసురేష్, టి.ఎన్.వి.ఆర్. క్రిష్ణశర్మ, వినందకిషోర్, కె.నరేంద్రలను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆర్.రామ్‌మోహన్ రాజు, ఇ.శ్రీనాథ్‌బాబు, జె.మదన్‌కుమార్, ఎస్.రవికుమార్‌ను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రటరీలుగా డి.నరసయ్య, కె.శోభారాణి, సి.రూపేష్‌రెడ్డి, సి.యస్వంత్‌కుమార్‌లతో పాటు జేసీసీ మెంబర్‌గా ఎన్.హరిప్రసాద్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశామన్నారు. అనంతరం ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను జడ్పీ ఛైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గానికి అన్ని విధాలుగా సహాయసహకారాలను అందిస్తామన్నారు.

విజయమే లక్ష్యంగా బరిలోకి దిగాలి

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 25: విజయమే లక్ష్యంగా క్రీడాకారులు బరిలోకి దిగాలని ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి అరుణకుమారి సూచించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో 70వ పురుషుల సీనియర్ జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్ జరిగాయి. ముఖ్య అతిథిగా ఆమె హాజరై తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తదుపరి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కబడ్డీ క్రీడాకారులు ఉత్సాహంగా ఎంపికల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను వచ్చే మార్చి 3 నుండి 5వ తేదీ వరకూ వైజాగ్‌లో జరుగునున్న అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సివుంటుందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య వివరించారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే...: కె.హరిప్రసాద్‌రెడ్డి, జి. సమరసింహారెడ్డి, కె. చంద్రశేఖర్, కె. గిరీష్‌కుమార్, ఎ. వేణుసాయి, బి. వంశీ, ఎన్.ధనుష్‌రెడ్డి, జి.చైతన్య, కె.ప్రేమ్ చంద్‌రెడ్డి, ఎస్.రుష్యేంద్రసాయి, ఎం.రామాంజనేయులు, కె.సాయివిఘ్నేష్, స్టాండ్ బైగా టి.గురుశివయ్య, పి.బాష, వి.వంశి, టి.గురువర్ధన్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్. శ్రీధర్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

నెంబర్-1 జట్టుగా రాణించాలి



క్రీడాకారులతో గోవర్ధన్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 25: నెంబర్ ఒన్ కబడ్డీ జట్టుగా రాణించేలా జిల్లా సీనియర్స్ కబడ్డీ క్రీడా జట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.గోవర్ధన్‌రెడ్డి క్రీడాకారులకు సూచించారు. ఆదివారం స్థానిక రాజీవ్ మార్గ్‌లోని శివశివానీ హైస్కూల్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కబడ్డీ సీనియర్స్ (80 కేజీల విభాగం) జట్టు ఎంపిక ప్రక్రియ జరిగింది. ముఖ్యం అతిథిగా గోవర్ధన్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే మార్చి 8,9,10, తేదీలలో నెల్లూరు జిల్లా కోవూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి 70వ సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే... : శివగణేష్‌రెడ్డి, దినేష్ చౌదరి, చెన్నకృష్ణ, చెన్నకేశవరెడ్డి, వంశీ, వీరకుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్, నవీన్, గణేష్, ఖ్యాతివర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, వెంకట శ్రీసుభాస్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో శివశివానీ హైస్కూల్ డైరెక్టర్ నాగేంద్ర రెడ్డి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ట్రెజరర్, జై చంద్రబాబు, వైవీయూ కబడ్డీ కోచ్ మనోహర్, సీనియర్ క్రీడాకారులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాసాగర్ హాస్పిటల్‌లో రోబోటిక్ టెక్నాలజీ

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 25 : విద్యాసాగర్ హాస్పిటల్‌లో రాయలసీమలోనే ప్రప్రథమంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రోబోటిక్ టెక్నాలజీని మోకాళ్లు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సకు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, కడప టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పాల్గొన్నారు. రోబోటిక్ ద్వారా మోకాలి మార్పిడి, పాక్షిక మోకాలి మార్పిడి, తుంటికీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స, రివిషన్ నీ రీప్లేస్‌మెంటు, సీటీ రేడియేషన్ అవసరం లేకుండా రియల్ ఇంటెలిజెన్స్ అండ్ హెల్త్ రోబోటిక్ ఆర్మీ ఉపయోగించి శస్త్రచికిత్సలు చేయగలమని డాక్టర్ సి.విద్యాసాగర్‌రెడ్డి వివరించారు. వైద్యులు శస్త్రచికిత్స నైపుణ్యంతో పాటు అత్యాధునిక కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ వాడడంతో ఎప్పుడూ ముందు ఉంటూ గత మూడునాలుగు సంవత్సరాల దేశ విదేశాల్లో రోబెటిక్ టెక్నాలజీపై విశేష అనుభవం రోబోటిక్ టెక్నాలజీ డిజైన్ చేసిన బృందంతో చర్చలు జరిపిన తరువాత ఈ టెక్నాలజీని తీసుకురావడం జరిగిందన్నారు. మోకాలి మార్పిడి హిప్ రీప్లేస్‌మెంటు నొప్పిని తగ్గించడం, పేషంటు రోజూ వారి పనులు పూర్తి స్థాయిలో పునరుద్ధరించడం కీలకమన్నారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా వంద శాతం ఖచ్చితత్వం, త్వరితగతిన రికవరీ, తక్కువ నొప్పి, దీర్ఘకాలిక మన్నిక, తక్కువ బోన్‌లాస్, తక్కువ టిష్యూలాస్, సాధారణ మోకాలు అనే భావన సునాయసమైన మోకాలు, కదలికలు, సత్ఫలితాలు వంటి అనేక లాభాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, హాస్పిటల్ సిబ్బంది, స్విప్ట్ అండ్ నిబ్యు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పుత్తా నరసింహారెడ్డిని సన్మానిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి, శ్రీలక్ష్మి

దళితుడి పొలంపై రౌడీ మూకల దాడి

పెనగలూరు, ఫిబ్రవరి 25 : పెనగలూరు మండలం సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబరు 729/3లో కంబాలకుంట హరిజనవాడకు చెందిన పందికాళ్ల నారాయణకు 4.53 ఎకరాల డీకేటీ పొలం ఉంది. తన పూర్వీకుల నుంచి సంక్రమించిన 1బీ, ఆర్‌వోఆర్, పాసుపుస్తకాలు, రికార్డులు కూడా ఉన్నాయి.

కాగా, ఈ పొలం తమదంటూ సింగారెడ్డిపల్లెకు చెందిన ఉమా శంకర్ అనే వ్యక్తి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి సహకారంతో ఆదివారం 50 మందితో కలసి ఇనుప రాడ్లు, గడ్డపారలతో ఫెన్సింగ్ పోళ్లను ధ్వంసం చేసినట్లు బాధితుడు వాపోయాడు. మామిడి మొక్కలు, మునగచెట్లను పీకేస్తుండగా అడ్డు తగలబోయిన తమ కుటుంబ సభ్యులపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో తాము పారిపోయామని తెలిపాడు. ఈ విషయంపై పెనగలూరు ఏఎస్ఐ మల్లికార్జునకు ఫిర్యాదు చేయడంతోపాటు, ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా అందజేశామన్నారు. ఈ సంఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని రాజంపేట డీఎస్పీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు.

ఈ విషయంపై పెనగలూరు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రి బందోబస్తు కార్యక్రమంలో ఉండడంతో ఏఎస్ఐకి ఫిర్యాదు పత్రాలను అందజేయాలని తెలిపానన్నారు.



రైతు పొలానికి ఉన్న ఫెన్సింగ్ రాళ్లను తొలగిస్తున్న రౌడీమూకలు

వైవీయూ వసతిగృహాలను సందర్శించిన ఆర్డీవో

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 25 : వైవీయూ వసతిగృహాలను కడప ఆర్డీఓ మధుసూదన్ సందర్శించారు. గ్రూప్-2 పరీక్షలు తనిఖీ చేసేందుకు వచ్చిన ఆర్డీఓ, వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్‌ను కలిశారు. వసతిగృహ పరిసరాలు, వంటశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుని హాస్టలుకు వచ్చిన వారితో మాట్లాడారు. వారికి అందిన వైద్యసేవలు, వసతిగృహ సౌకర్యాలపై ఆరా తీశారు. అనారోగ్యానికి గురైన వెంటనే రిమ్స్‌కు తీసుకెళ్లి వైద్యమందేలా చూశారని అక్కడ ఉండి మాకు ధైర్యం చెప్పారని విద్యార్థినులు సమాధానం ఇచ్చారు. విశాఖ నుంచి వచ్చిన విద్యార్థిని తల్లి స్పందిస్తూ తమ పిల్లలను కన్నవారిలా చూసుకున్నారని తెలిపారు. ఆర్డీవో మధుసూధన్, వైస్‌ఛాన్సలర్ సుధాకర్ హాస్టలు విద్యార్థుల కోసం తయారు చేసిన ఆహారం తిన్నారు. ఆహారం రుచికరంగా ఉన్నాయంటూ ఆర్డీవో వ్యాఖ్యానించారు. యూనివర్శిటీ అభివృద్ధి కోసం వైస్‌ఛాన్సలర్ కొన్ని ప్రతిపాదనలు చేయగా రెవెన్యూ పరిధిలో తప్పక చేస్తామని తెలిపారు, నీరు ఆహార పదార్థాలు టెస్టింగుకు పంపామని, నివేదిక రావాల్సి ఉందని వీసీ ఆర్డీవోకు తెలిపారు.



హాస్టల్‌లో భోజనం చేస్తున్న ఆర్డీవో, వైవీయూ వీసీ

బ్రౌన్ లైబ్రరీని బతికించండి

వైస్ చాన్సలర్‌కు జానమద్ది విజయభాస్కర్ లేఖ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 25 : సీపీ బ్రౌన్ లైబ్రరీని బతికించాలని బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ వైవీయూ వైస్‌చాన్సలర్‌కు శనివారం లేఖ రాశారు. వైస్‌చాన్సలర్‌కు మూడు నెలల నుంచి బ్రౌన్‌గ్రంథాలయం ఆవరణంలో గోడపై ఉన్న బ్రౌన్ చిత్రం తెలుగులో పూర్తి పేరు రాయించాలని లేఖ రాసినట్లు తెలిపారు. కడప లోక్ అదాలత్ జడ్జి ఉత్తర్వుల మేరకు పుస్తకాల డిజిటలైజీకరణకు దాదాపు రూ.4 లక్షలతో కొన్నారని దానిని ఇప్పుడు మూలన పడేశారన్నారు. పలుమార్లు దీనిపై లేఖ రాసినా ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఫిబ్రవరి 28న తమ తండ్రి దశమ వర్ధంతిని ఎలాంటి ఖర్చులు సభా సమావేశం ఆర్భాటం లేకుండా సాధారణంగా జరపాలని ఆ ఖర్చులు మొత్తాన్ని పైన తెలిపిన పనులకు వాడుకోవాలని కోరినట్లు తెలిపారు.

గంగమ్మకు బోనాలు



పూజలు చేస్తున్న అర్చకులు

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 25: మండలంలోని అనంతపురం గ్రామంలో ఆదివారం గంగమ్మకు పూజలు చేసి, బోనాలు సమర్పించారు. 15 రోజుల్లో జాతర ఉండడంతో దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ రవీంద్రరాజు, అర్చకులు గంగాధర్, సురేంద్ర ఏర్పాట్లు చేశారు.

నాగారపమ్మకు పూజలు

సుండుపల్లె, ఫిబ్రవరి 25: మండలంలోని ఈడిగపల్లి సమీపంలోని నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పిం చారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు, తలనీలాలను సమర్పించారు. ఆలయ సమీపంలో మామిడి తోటల్లో అన్నదానం చేశారు.

నల్లగంగమ్మ ఆలయంలో సందడి

సంబేపల్లె, ఫిబ్రవరి 25: దేవరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నల్లగంగమ్మ ఆలయ నిర్మాణకర్త, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మునగా మురళీస్వామి, ఈవో కొండారెడ్డిల ఆధ్వర్యంలో భక్తుల వసతి సౌకర్యాలపై ఆరాతీశారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న వేదపండితులు

పుల్లంపేట, ఫిబ్రవరి 25 : మండల పరిధిలోని కొమ్మనవారిపల్లె పంచాయతీ చొప్పావారిపల్లెలో ఆదివారం సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, ఎర్ర నిర్మల భాస్కర్‌రెడ్డి సహకారంతో దాదాపు 30 లక్షల రూపాయలు వెచ్చించి కోదండరామాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో ఆదివారం శిఖరస్థాపన, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, తులసీఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

అయ్యప్పస్వామి గుడి కూల్చివేత



చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న అయ్యప్ప స్వామి సొసైటీ సభ్యులు

చిన్నమండెం, ఫిబ్రవరి 25: మండల పరిధిలో దేవపట్ల రోడ్డు ఆనుకుని ఉన్న జగనన్న కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 4504/3లో మణికంఠ అయ్యప్పస్వామి సొసైటీ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున అయ్యప్ప స్వామి దేవాలయాన్ని నిర్మించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికిరాత్రే ఆలయాన్ని కూల్చేశారు. ఈ సంఘటనపై విచారించి వారిపై చర్యలు తీసుకో వాలని అయ్యప్ప సొసైటీ సభ్యులు చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోకుంటే హిందూ ధార్మిక సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

భార్యపై భర్త దాడి

పీలేరు, ఫిబ్రవరి 25: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త నిద్రిస్తున్న ఆమెపై కొడవలితో దాడి చేసిన ఘటన ఆదివారం పీలేరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు వేపులబైలు పంచాయతీ జంగంపల్లెకు చెందిన గురవయ్య(35), అనితకు 11 ఏళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారు. గురవయ్య, కొంత కాలంగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. శనివారం సాయంత్రం భార్యపై గొడవ పడగా పోలీసు స్టేషన్‌లో పంచాయతీ జరిగింది. అయితే కోపం చల్లారని అతను ఆదివారం ఉదయం నాలుగు గంటల సమయంలో ఇంటిలో నిద్రిస్తున్న అనితపై కొడవలితో దాడి చేశాడు. తల్లి అరుపులతో మేల్కొన్న పిల్లలు అర్చన(13), వంశీ(10) తండ్రిని అడ్డుకోబోయారు. ఉన్మాదంలో ఉన్న అతను వారిపై కూడా దాడికి ప్రయత్నించడంతో వారు తలుపులు తీసుకుని బయటకు వచ్చి విషయాన్ని ఇరుగుపొరుగు వారికి చెప్పారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గురవయ్య పరారయ్యాడు. పోలీసులు అనితను హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దిక్కూమొక్కూ లేని జగనన్న కాలనీలు

- నిర్మాణాలకు ఆసక్తి చూపని లబ్ధిదారులు

గాలివీడు, ఫిబ్రవరి25: నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోవడం, ప్రభుత్వం అందజేసే సాయం భవన నిర్మాణానికి ఏ మూలకు సరిపోక పోవడంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 20 జగనన్న కాలనీలున్నాయి. అరవీడు పంచాయతీ మలసానివాండ్లఎల్లెలో 71, ఎగువగొట్టివీడులో 3, గాలివీడుపంచాయతీ ప్రాజెక్టు సమీపంలో 84, బలిజపల్లె 24 , అరవీటివాండ్లపల్లెలో 48, గాలివీడులో 87, గరుగుపల్లె పంచాయతీలోని కస్పాలో 6, గుండ్లచెరువు పంచాయతీలో 4, కొర్లకుంట పంచాయతీ చావిడిపల్లెలో 29, నూలివీడులో 2, ఆవులవాండలపల్లెలో 27, వడ్లపల్లెకు సమీపంలో 22, పందికుంటలో 7, పూలుకుంటలో 13, తలముడిపిలో 3, తూముకుంటలో 6 , వెలిగల్లులో 3 జగనన్న కాలనీల్లో 124 ఇండ్లు మంజూరయ్యాయి. వీటిలో 126 గృహాలు ఇంతవరకు నిర్మాణానికి నోచుకోలేదు. 242 ఇండ్లు పునాదులకే పరిమితం కాగా 46 ఇండ్లు గోడల వరకు, 49 ఇండ్లు మౌల్డింగ్ వరకు పూర్తయ్యాయి. మండల వ్యాప్తంగా 558 ఇండ్లు మంజూరు కాగా , కేవలం 52 ఇండ్లు మాత్రమే పూర్తి అయ్యాయి.





అరవీడులో మౌలిక సదుపాయాలకు నోచుకోని జగనన్న కాలనీ (ఇన్‌సర్ట్) నూలివీడులో పునాదులకు పరిమితమైన ఇళ్లు

అరకొర వసతులు

జగనన్న కాలనీలను రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి కొరత సమస్యలు వేధిస్తున్నాయి. పలు కాలనీల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇంటి నిర్మాణానికి ఖర్చులు పెరిగిపోవడంతో ప్రభుత్వం ఇచ్చే సహాయం ఏ మూలకు సరిపోవడం లేదని లబ్ధిదారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం లక్షా 70 వేల రూపాయలు ఇస్తోందని, కానీ నాలుగు లక్షలు ఖర్చు అవుతున్నదని చెబుతున్నారు. ఇంటి నిర్మాణాలు చేపితే అప్పుల పాలు అయిపోక తప్పదని వారు అంటున్నారు.

గ్రహణం వదలాలంటే బాబు రావాలి: కస్తూరి



రాజుకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న కస్తూరి తదితరులు



కాకర్లవారిపల్లెలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నగిరిపాటి రేవతి

చిట్వేలి, ఫిబ్రవరి25 : రాష్ట్రానికి పట్టిన గ్రహణం వదలాలంటే చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని రాజుకుంట, చింతలచెలికలో మండల అధ్యక్షుడు కెకె.చౌదరి ఆధ్వర్యంలో జనసేన నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరి ఇంటింటికి కరపత్రాలను పంచారు. అనంతరం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రజలను నట్టేట ముంచాడని ఆరోపించారు. వైసీపీ అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కేకే చౌదరి, పారిశ్రామిక వేత్త విశ్వేశ్వర్‌నాయుడు, పూల రమేష్, రాజశేఖర్, లాయర్ బాలాజీ, మహిళ నేతలు అనిత దీప్తి, రేవతి, బాలకృష్ణ, గుండయ్య, శ్రీధర్, అనంతయ్య యాదవ్, జనసేన నాయకులు మాదాసు నరసింహ, వెంకటేష్‌రాజు, సుబ్రమణ్యం యాదవ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ విజయానికి మండల స్థాయి నాయకులతో పాటు సాధారణ కార్యకర్తలు కూడా కృషి చేయాలని నియోజకవర్గ దళిత నాయకురాలు నగిరిపాటి రేవతి కోరారు. ఆదివారం మండలంలోని కాకర్లవారిపల్లె, వడ్డిపల్లె, వెంకటనారాయనపల్లె, ముద్రపల్లెల్లో విస్తృతంగా పర్యటిం చారు. ఈ సందర్భంగా నాయకులతో ఆమె మాట్లాడుతూ టీడీపీ, జనసేన సంయు క్తంగా తయారు చేసిన మేనిఫెస్టో సూపర్ సిక్స్ గురించి ప్రతి కుటుంబంలో తెలిసే విధంగా కరపత్రాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కాకర్ల జయరామయ్యనాయుడు, కాకర్లవారి పల్లె సర్పంచ్ కె.శివయ్యనాయుడు, మండల నాయకులు కృష్ణయ్యనాయుడు, శివ, ఎస్సీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్న, మాజీ తహసీల్దారు సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

అభ్యర్థుల ఎంపికలో సమన్యాయం



శ్రీనివాసరెడ్డిని కలిసిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సుండుపల్లె, ఫిబ్రవరి 25: రాయచోటి తెలుగు దేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆదివారం కలిసినట్టు పార్లమెంటు వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి దామోదర్‌నాయుడు, చిట్టెం రామచంద్ర తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విడుదల చేసిన టీడీపీ అభ్యర్థుల లిస్టు అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసేలా ఉందన్నారు. . ఈ కార్యక్రమంలో ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్,: రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ అధిష్టానం ప్రకటించడంతో ఆదివారం రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె, గాలివీడు, చిన్నమండెం మండలాల నుండి పలువురు నాయకులు, కార్యకర్తలు రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి సంఘీభావం తెలియ ఎజేశారు.

పొలిట్‌బ్యూరో సభ్యుడితో..

రాయచోటిటౌన్: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డిని ఆదివారం రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పార్టీ స్థితిగతులపైన చర్చించి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు.

రాష్ట్ర పునర్నిర్మాణ సభకు తరలిరండి

రాజంపేట, ఫిబ్రవరి 25 : నేడు అనంతపురంలో జరిగే రాష్ట్ర పునర్నిర్మాణ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని పీసీసీ కార్యవర్గ సభ్యుడు అత్తింజేరి శ్రీనాథ్, రాజంపేట కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఇన్‌చార్జి గాజుల భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాజంపేట పట్టణంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. దుష్ట చతుష్టయ పార్టీలను ఓడించండి, కాంగ్రెస్ పార్టీని గెలిపించండి, రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం, మోసం, అన్యాయం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బి అంటే బాబు, జె అంటే జగన్, పి అంటే పవన్‌గా ఈ మూడు ప్రాంతీయ పార్టీలు తయారయ్యాయని, మోడీ చేతిలో కబాలిలుగా, కీలు బొమ్మలుగా, బానిస పార్టీలుగా తయారయ్యాయన్నారు. ౹

అన్న క్యాంటీన్ నిర్వహణ అభినందనీయం



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, వాణి

రాజంపేట, ఫిబ్రవరి 25: తెలుగుదేశం పార్టీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో అన్న కాంటీన్ ద్వారా పేద ప్రజలకు రుచికరమైన భోజనాన్ని అందించడం అభినందనీయమని టీడీపీ రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, రాజంపేట మహిళా ఉపాధ్యక్షురాలు వాణి తెలిపారు. ఆదివారం వారు అన్న క్యాంటీన్‌ను వారు పరిశీలించి పేదలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల కిందట టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఆశీస్సులతో ఈ క్యాంటీన్‌ను ప్రారంభించారని ప్రతి రోజూ 500 మంది పేదలు ఇక్కడ భోజనం చేయడం చాలా ఆనందదాయకమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని ప్రాంతాల్లో ఉన్న అన్న క్యాంటీన్‌లు పునరుద్ధరిస్తారన్నారు.

సమాజ శాంతి కోసం 'మానవత' కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మానవత సభ్యులు

చిట్వేలి, ఫిబ్రవరి25 : సమాజంలో శాంతి స్థాపన కోసమే మానవత సంస్థ సేవలు అందిస్తోందని ఆ సంస్థ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో ఆ సంస్థ నెలవారీ సమావేశం నిర్వహించారు. మానవత అధ్యక్షుడు సాయిరాం, కార్యదర్శి మునిరావు, గౌరవ సలహాదారు తిరుమల విశ్వనాథం రంగారెడ్డి, వీరాంజనేయరాజు, సుబ్రమణ్యంరెడ్డి, రోళ్ల మోహన, ఉపాధ్యాయులు కాలేషా, పాఠశాల ఉపాధ్యాయులు సాజి, సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 25: స్థానిక గాలివీడు రోడ్డులోని పెద్దకాల్వపల్లె వద్ద ఆదివారం కారు ఢీకొనడంతో గీత అనే మహిళకు గాయాలయ్యాయి. పెద్దకాల్వపల్లెకు చెందిన గీత భర్తతో కలిసి ద్విచక్రవాహనంలో రాయచోటి నుంచి ఇంటికి వెళుతూ పెద్దకాల్వపల్లె వద్ద రోడ్డు దాటుతుం డగా కారు ఢీకొంది. దీంతో గాయపడిన ఆమెను రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి25 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29న తేదీన అన్ని జిల్లా కార్యాలయాల వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ రాజంపేట భవన నిర్మాణ కార్మికులు ఆర్‌అండ్‌బీ బంగ్లా ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం గత ప్రభుత్వాలు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసి కార్మికుల హక్కులను, వారి ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీశారన్నారు. కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన రాయితీలను కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లా కార్యాలయాల వద్ద భవన నిర్మాణాలు కార్మికులు ధర్నా చేయనున్నారన్నారు. రాజంపేట నుంచి 250 మంది కార్మికులు రాయచోటి కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాకు హాజరవుతారన్నారు. కార్మిక సంఘ నాయకులు పి.సుబ్రమణ్యం, నన్నే సాహెబ్, నాగభూషణం, రమణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థలం వివాదంతో దాడి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 25: ఇంటి స్థలం విషయంలో ఏర్పడిన వివాదం ఓ వ్యక్తిపై దాడికి కారణమైంది. రా యచోటి పట్టణ పరిధిలోని సిబక్‌తుల్లా కాలనీలో తమకు ఇచ్చిన స్థలాన్ని సుండుపల్లె మండలం పొలిమేరపల్లె గ్రామం బీజీ రాచపల్లెకు చెందిన మహేశ్వర్‌రాజు కబ్జా చేశాడని బాధితుడు బాలూనాయక్ ఆరోపించాడు. ఆదివారం కొంత మందితో కలిసి తనపై రాడ్లతో దాడి చేయడంతోపాటు, కులం పేరుతో దూషించారని బాధితుడు తెలిపాడు. దాడిలో గాయపడిన బాలూనాయక్‌ను కుటుంబ సభ్యులు రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఇంతవరకు తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కమనీయంగా వేంకటేశ్వర కల్యాణం





కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

సుండుపల్లె, ఫిబ్రవరి 25: మండలంలోని ముదుంపాడు గ్రామ పంచాయతీ పరికిబండ బిడికి సమీపంలో వెలసిన ఆలయంలో ఆదివారం వేంకటేశ్వర కల్యాణం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అర్చన, కలశపూజ, మహామంగళ హారతి నిర్వహించారు. ఉదయం 9 గంటలకు తిరుపతి స్వాముల వారికి అభిషేకం చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవిలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. జీ. రెడ్డివారిపల్లెకు చెందిన రాయపాటి జయరామయ్య కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు నాకిది గోపాలకృష్ణపురం వరకు రథోత్సవం నిర్వహించారు.

లూథరన్ చర్చి వద్ద అనితాదీప్తి ప్రచారం



టీడీపీ మేనిఫెస్టో వివరిస్తున్న అనితా దీప్తి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 25: టీడీపీ విజయం కోసం పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న సెయింట్ లూథరన్ చర్చిలో మహిళ నాయకురాలు అనితా దీప్తి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ ప్రజలంతా ఈసారి టీడీపీ వెంట ఉన్నారని తెలిపారు. ఒక సారి నమ్మి ఓటు వేస్తే ఎస్సీ కార్పొరేషన్ నిధులు స్వాహా చేసి ఎస్సీలను నట్టేట ముంచారని ఆరోపించారు. అనంతరం చర్చి కాంపౌండ్ వద్ద టీడీపీ సూపర్ సిక్స్ మేనిఫెస్టోను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాప్ మాజీ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, పట్టణ అధ్యక్షుడు పొకల మణి, వార్డు సభ్యులు మణి యాదవ్, మద్దిన గిరి నాయుడు, దారపునేని వెంకటరమణ నాయుడు, శ్రీను, ఏసోబు చౌదరి, మవిళ్ల రామయ్య, నగిరిపాటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంటు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన నాయకుడు అతికారి కృష్ణ

సిద్దవటం, ఫిబ్రవరి 25 : సిద్దవటం మండలం దిగువపేటలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంటు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ జన సేన పార్టీ నేత అతికారి కృష్ణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో యువత పెద్ద ఎత్తున జనసేన పార్టీకి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు సరైన గుర్తింపు ప్రోత్సాహం జనసేన పార్టీకే సాధ్యమన్నారు. అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన కోడూరు జట్టుకు రూ. 25 వేలు, సిద్దవటం జట్టుకు ద్వితీయ బహుమతి రూ.15 వేలు, మాధవరంపోడు జట్టుకు తృతీయ బహుమతి రూ.7500 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు రాజేష్, హరి రాయల్, పోలిశెట్టి శ్రీనివాసులు, చిన్న వెంకటయ్య, సుబ్రమణ్యం, మహబూబ్ బాషా, పసుపులేటి గంగయ్య, ఆవుల రాజా, పసుపులేటి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో ఏఐఎఫ్‌బీ పోటీ..



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌బీ పార్టీ జిల్లా కన్వీనర్ కాలేషా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 25: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అన్నమయ్య జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందని, ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కాలేషా అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 1939లో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ ఎన్నికల్లో ఇతర వామపక్ష పార్టీల కంటే ఎక్కువ ఓట్లను దక్కించుకుందని, కొత్తగూడెం స్థానంలో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అదే స్థాయిలో 175 స్థానాల్లో పోటీ చేయడానికి ఇప్పటికే అనేక మంది అభ్యర్థులు సంప్రదిస్తున్నారన్నారు. ప్రజా సేవ చేయాలని, ఇతర రాజకీయ పార్టీల్లో అణిచివేతకు గురైన అభ్యర్థులు తమ బలాన్ని నిరూపించుకోవాలనుకునే వారు తమను సంప్రదించాలని ఆయన కోరారు.

సంప్రదాయ కళలను కాపాడటం అభినందనీయం



అతిథులకు ఆహ్వానం పలుకుతున్న బొమ్మవరం గ్రామస్తులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 25: సంప్రదాయ కళలను వెలుగులోని తీసుకురావడం అభినందనీయమని టీడీపీ నాయకుడు ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి అన్నారు. మండలంలోని బొమ్మవరం గ్రామంలో నిర్వహించిన కోలాటం గజ్జ పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్, నియోజకవర్గం నాయకులు గడ్డెం చంగల్ రాజు, ఉమ్మలరాజు సుబ్బరాజు, ఉమ్మలరాజు పిచ్చిరాజు, మాజీ సర్పంచ్ సెకునాల నరసింహరాజు, మాజీ ఎంపీటీసీ శంకర్ రాజు, జనార్ధన్‌నాయుడు, నారపరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్, రమణరాజు, శంకర్‌రాజు, గౌతంరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయం: పంతగాని



వైద్య సిబ్బందితో చర్చిస్తునన పంతగాని

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 25: జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయం అని టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని హెచ్‌ఎంఎం హైస్కూల్‌లో జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప భారతీయ హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్ట్ మిత్రులు సమాజం కోసం తన వంతు సాయం చేయడం అభినందనీయమని కొనియాడారు. ముక్కారూపానంద రెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా సాయి వికాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఈ శిబిరానికి సుమారు 900 మంది హాజరుకాగా, 80 మందిని ఆపరేషన్ల కోసం కడపకు తరలించినట్లు తెలిపారు. రైల్వేకోడూరు ప్రజల కోసం భవిష్యత్తులో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వైద్యం కోసం వచ్చిన ప్రజలకు భోజన సదుపాయం కల్పించారు. డాక్టర్ స్వరూపరాణి పాల్గొన్నారు.

16 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లకు ఎంపిక చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 45 మందికి పరీక్షలు నిర్వహించి, 16 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా రామిరెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న రామిరెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 25: మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా తనను నియమిస్తూ అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లాబకష్ ఉత్తర్వులు జారీ చేశారని కోనంపేటకు చెందిన రామిరెడ్డి తెలిపారు. రాయచోటిలో నిర్వహించిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో మండల అధ్యక్షుడిగా నియమాకపత్రాన్ని అందజేశారని ఆయన తెలిపారు జిల్లా అధ్యక్షుడితోపాటు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జింకపై కుక్కల దాడి

● రక్షించిన స్థానికులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 25: చిత్తూరు నగరంలోని అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి ఓ జింక ఆదివారం గిరింపేటలోని పాత కలెక్టరేట్ వద్దకు చేరుకుంది. దానిపై అక్కడి వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కల బారి నుంచి జింకను రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. తూర్పు అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పశువైద్యాధికారులతో జింకకు వైద్యసేవలు అందించి, సురక్షితంగా అటవీ ప్రాంతానికి చేర్చారు. జింకను కాపాడిన స్థానికులకు తూర్పు ఫారెస్టు రేంజ్ అధికారి థామస్ కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల దాడిలో గాయపడిన దుప్పి


గాయపడిన దుప్పికి చికిత్స చేస్తున్న పశువైద్యులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 25: దారి తప్పి ఓ దుప్పి గ్రామ సమీపానికి రావడంతో ఆదివారం ఊరి చివర్లోని కుక్కలు దానిపై దాడిచేసి గాయపరిచాయి. ఈ సంఘటన మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ దండువారిపల్లెలో చోటుచేసుకుంది. గాయపడిన దుప్పిని గ్రామస్తులు రక్షించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు ఆ దుప్పిని చికిత్స నిమిత్తం నలగాంపల్లె పశువైద్యశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో శివకుమార్, ఎఫ్‌బీవోలు ప్రతాప్, పద్మావతి, ఏబీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పొరపాట్లు జరగరాదు


విమానాశ్రయంలో అధికారులతో సమీక్షిస్తున్న జేసీ, ఎస్పీ

రేణిగుంట, ఫిబ్రవరి25: ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరబాట్లకు తావుండరాదని జేసీ శుభంబన్సల్, ఎస్పీ మలికాగర్గ్ అధికారులను ఆదేశించారు. సీఎం జగన్ సోమవారం మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనకు రానున్నారు. ఇందుకోసం సోమవారం ఉదయం 9.35 గంటలకు సీఎం విమానాశ్రయం చేరుకుంటారు. 9.45 గంటలకు చిత్తూరు జిల్లాలో పర్యటనకు వెళతారు. సీఎం తన పర్యటన ముగించుకొని తిరిగి మూడు గంటలకు విమానాశ్రయం చేరుకుంటారు. 3.10 గంటలకు విమానాశ్రయం నుంచి గన్నవరం బయలుదేరి వెళతారు. ఈ క్రమంలో విమానాశ్రయంలో ఆదివారం ముందస్తు భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విమానాశ్రయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఎస్పీ పాటిల్‌దేవరాజ్‌మనీష్, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసరావు, అధికారులు శ్రీహరి, రవిప్రభు, రమణయ్య, విమానాశ్రయం అధికారులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి హామీలను నమ్మం: ఎస్టీయూ



సమావేశంలో ప్రసంగిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 25: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇస్తున్న ఉత్తుత్తి హామీలను తాము నమ్మే పరిస్థితుల్లో లేమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులను మభ్యపెట్టే విధంగా వేతన సవరణ కమిటీని నియమించి, కనీసం మధ్యంతర భృతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ.. ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణనాతీతమన్నారు. 117 జీవో తప్పనిసరిగా సవరించాలని, డీఎస్సీ నోటిఫికేషన్ సమీక్షించి 50వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు గంటా మోహన్, పురుషోత్తం, జగన్మోహన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, హేమచంద్ర, యువరాజ్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 72,175 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 29,543 మంది తలనీలాలు సమర్పించారు.



టీటీడీ అజెండాలో ఎన్నికల తాయిలాలు!

ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీకి కావాల్సిన వారికి తాయిలాలు ప్రకటించేందుకు టీటీడీ సిద్ధమైంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో నేటి ఉదయం 10 గంటలకు జరిగే పాలకమండలి సమావేశంలో మూడు దశాబ్దాల కిందటే గడువు ముగిసిన తట్ట లైసెన్సులను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనుకూలుర షాపులకు ఒకచోట నుంచీ మరోచోటకు తరలించేందుకు అనుమతులు లభించనున్నాయి. ఉద్యోగులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా 400మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయనున్నారు.ఇంజనీరింగ్ పనులకూ పెద్దఎత్తున అనుమతులు ఇవ్వనున్నారు.

-తిరుపతి,ఆంధ్రజ్యోతి

నేటి పాలకమండలి సమావేశం ముందుకు పలు కీలక అంశాలు

30 ఏళ్ళ క్రితం గడువు ముగిసిన తట్ట లైసెన్సుల పునరుద్ధరణ

తిరుమలలో దుకాణాలు కాకుండా రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే హాకర్లకు టీటీడీ తట్ట లైసెన్సులు జారీ చేసే విషయం తెలిసిందే.వీటికి విపరీతమైన డిమాండ్, విలువ వుంది. లైసెన్సులు తీసుకున్న వారు అనధికారికంగా ఇతరులకు రోజువారీ లేదా నెలవారీ సబ్ లీజులకు ఇచ్చి లక్షలు సంపాదిస్తుంటారు. కీలక ప్రాంతాలు, కూడళ్ళలో వీటి అద్దెలు ఊహించలేని విధంగా వుంటాయి. 1987 నుంచీ 1993 మధ్య గడువు ముగిసిన సుమారు 162 తట్ట లైసెన్సులను పునరుద్ధరించే అంశాన్ని ప్రస్తుత సమావేశ అజెండాలో చేర్చినట్టు సమాచారం. ఇందులో 90 వరకూ లైసెన్సులను వైసీపీకి సంబంధించిన వారు కొనుగోలు చేశారని, వారి పేరిట తాజాగా సంబంధిత లైసెన్సులను పునరుద్ధరించేందుకు యత్నిస్తున్నారని సమాచారం. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి ఉపయోగపడే కీలక వ్యక్తులకు ఈ సాయం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.తిరుమల కొండపై తట్ట లైసెన్సులతో పోలిస్తే వంద రెట్లు అధిక విలువ, డిమాండ్ దుకాణాలకు వుంటుంది. తిరుమలలో టీటీడీ నుంచీ షాపులు పొందిన వారిలో అధికశాతం యజమానులు భారీ మొత్తాల్లో అడ్వాన్సులు, అద్దెలు తీసుకుని ఇతరులకు అప్పగిస్తుంటారు. యాత్రికుల రద్దీ అధికంగా వుండే ప్రాంతాల్లోనూ, కీలక కూడళ్ళలోనూ వుండే షాపుల విలువ అపారంగా వుంటుంది. అక్కడ షాపుల అడ్వాన్సులు, అద్దెలు సామాన్యుల ఊహాకందవు. యాత్రికుల సందడి తక్కువగా వున్న ప్రాంతాల్లోని షాపుల యజమానులు తమ షాపులను అనువైన చోటకు తరలించుకునేందుకు ఎంత భారీ మొత్తాలైనా చెల్లించేందుకు సిద్ధపడతారు. అయితే దానికి కూడా పైస్థాయి రాజకీయ సిఫారసుతో పాటు భారీ మొత్తాలు సమర్పించుకుంటే గానీ పనులు జరగవు. నేటి పాలకమండలి సమావేశంలో 14 షాపులను ఒక చోట నుంచీ మరోచోటకు తరలించే అంశాన్ని అజెండాలో పొందుపరిచినట్టు సమాచారం. ఇవన్నీ కూడా అధికార పార్టీ ముఖ్యనేతలకు బాగా కావాల్సిన వారివని సమాచారం.

నెలలోపే పాలకమండలి రెండో భేటీ

టీటీడీ పాలక మండలి సమావేశం చివరగా గత నెల 29వ తేదీన జరిగింది. సాధారణంగా పాలక మండలి సమావేశాలు రెండు నెలలకు ఓమారు జరుగుతాయి. అయితే నెలలోపే రెండోసారి సమావేశం ఏర్పాటు కావడంతోనే అందరి దృష్టి సమావేశంవైపు, అజెండా వైపూ మళ్ళుతోంది. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాలు పొందే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకే ఈ సమావేశం జరుగుతోందన్న ఆరోపణలకు ఇది బలం చేకూర్చేలా వుంది. మరోవైపు ఎన్నికలయ్యాక ప్రస్తుత ప్రభుత్వం తిరిగి వస్తుందో రాదోనన్న అనుమానం వుండడం వల్లే తమ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే ఉద్దేశంతోనే నెలలోపే రెండో సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్న ప్రచారమూ జరుగుతోంది.

400 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్

టీటీడీలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 400 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేసే అంశం కూడా అజెండాలో వున్నట్టు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలో, వాటర్ వర్క్స్, ప్రెస్ పబ్లికేషన్స్ విభాగం వంటి వాటిల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఈ ఉద్యోగులకు ప్రస్తుతం 14 వేల వరకూ వేతనం అందుతోంది. వీరికి టైమ్ స్కేల్ వర్తింపజేస్తే ఏకంగా వేతనం రూ. 30 వేల వరకు పెరగనుంది.

భారీగా ఇంజనీరింగ్ పనులకు అనుమతులు

టీటీడీ ఇంజనీరింగ్ కాంట్రాక్టు పనులను ఆదాయ వనరుగా మార్చుకున్న అధికార పార్టీ ముఖ్యనేత పాలక మండలిని అడ్డుపెట్టుకుని భారీగా పనులకు అనుమతులు జారీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఇంజనీరింగ్ పనులు పెద్దఎత్తున ప్రతిపాదించి వాటికి అనుమతులు జారీ చేయడం ద్వారా పర్సంటేజీలు వసూలు చేసుకునే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టపగలే దారుణ హత్య

● సోదరుడిపైనే అనుమానం


మృతుడు చంద్రశేఖర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25:పట్టపగలే... నడిరోడ్డుపై ఓ వ్యక్తిని అటకాయించి... పారిపోతుండగా వెంటాడి కత్తులతో దారుణంగా నరికి చంపిన ఘటన తిరుపతి రూరల్ మండలంలో ఆదివారం జరిగింది.పోలీసుల కథనం మేరకు.. ఎర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయితీ, పులిబోనువారిపల్లెకు చెందిన కానాల భాస్కర రెడ్డికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె సంతానం. వీరిలో రామ్మోహన్‌రెడ్డి పెద్ద కుమారుడు కాగా చంద్రశేఖరరెడ్డి (50) రెండో కుమారుడు. రామ్మోహన్‌రెడ్డి కొన్నేళ్లుగా తిరుపతిలోని మంచినీళ్లగుంట సమీపంలో నివాసం ఉంటుండగా చంద్రశేఖర్ రెడ్డి స్వగ్రామంలోనే వుంటున్నాడు.చంద్రశేఖర రెడ్డి కుమారులు కాలూరు క్రాస్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు చంద్రశేఖర రెడ్డి స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వచ్చాడు. కొంత సమయం గడిపిన తరువాత పిల్లలు తినుబండారాలు కావాలనడంతో వాటిని తీసుకొస్తానంటూ సాయంత్రం 3గంటలకు బయటకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.పాఠశాల సమీపంలోనే మాటువేసిన ఐదుగురు వ్యక్తులు చంద్రశేఖరరెడ్డిని అటకాయించారు. ఆయన ద్విచక్రవాహనంపై ఉండగానే దాడిచేయడం ప్రారంభించారు.దీంతో పరుగెత్తి పారిపోయేందుకు ప్రయత్నించగా ఆ ఐదుగురూ వెంటాడి కత్తులతో దారుణంగా నరికి వెళ్లిపోయారు.ఈ దాడిలో చంద్రశేఖరరెడ్డి ముఖం సగానికి పైగా రెండుగా తెగిపోయింది. ఓ చేతివేలు తెగి కిందపడిపోయింది. కుడిచేయి మణికట్టువద్ద ఎముకతో సహా విరిగిపోయింది. తీవ్రరక్తస్రావంతో అల్లాడిపోతున్న చంద్రశేఖరరెడ్డిని స్థానికులే 108అంబులెన్సులో రుయాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. తిరుపతి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన భర్తను ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డే హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి పాత నేరస్థుడని సమాచారం. అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై రౌడీషీట్ ఉండగా ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లోకూడా ఆయనపై కేసులున్నట్టు చెబుతున్నారు. అన్నదమ్ములిద్దరికీ కొంతకాలంగా ఆస్తి తగాదాలు నడుస్తున్నందున అన్నే మరికొందరితో కలిసి తమ్ముడిని హతమార్చి ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.రామ్మోహన్‌రెడ్డికి ఎర్రచందనం అక్రమ రవాణాలోకూడా భాగస్వామ్యం ఉందని, ఈ విషయాన్ని చంద్రశేఖరరెడ్డి బయట పెట్టినందుకే హత్యకు పాల్పడ్డారని కూడా ప్రచారం జరుగుతోంది.

తిరుమలకు రాజకీయ స్టిక్కర్‌తో కారు


అధికారపార్టీ జెండా, నాయకుడి ఫొటోతో ఆలయం ముందు కారు

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు తిరుమలకు వచ్చిన ఘటన మరువకముందే మళ్లీ ఆ తరహా అతిక్రమణే చోటుచేసుకుంది. అధికార పార్టీ జెండాలోని రంగులతో కూడిన స్టిక్కర్‌తో ఉన్న కారు ఆదివారం తిరుమలకు వచ్చి విమర్శలకు దారితీసింది. ఆ జెండాపై రాజకీయనేత ఫొటో కూడా ఉండటం గమనార్హం. టీటీడీ బోర్డు సభ్యుడికి చెందిన కారుగా తెలిసింది. రాజకీయ పార్టీల జెండాలు, గుర్తులు, వ్యక్తులతో కూడిన స్టిక్కర్లతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరిలోనే గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. అయితే అధికార పార్టీకి చెందిన వ్యక్తుల వాహనాలు కావడంతో భద్రతా సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే తరచూ అధికార పార్టీకి చెందిన జెండాలు, కండువాలు, స్టిక్కర్లతో వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి.

రుయాలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

● వర్చువల్‌గా చేసిన పీఎం నరేంద్ర మోదీ

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 25: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద దేశంలోని పలు క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ)లకు గుజరాత్ రాజకోట్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల అనుబంధ రుయాస్పత్రి ఆవరణలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన శిలా ఫలకం ఆవిష్కరించారు. ఎస్వీ వైద్య కళాశాల భవన విజయం ఆడిటోరియంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం వీక్షించే ఏర్పాటు చేశారు. పీఎం మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కేర్ ప్రాజెక్ట్ కింద దేశంలోని ఐదు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్ కళాశాలలను జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. 200కుపైగా హెల్త్ క్రిటికల్ కేర్ బ్లాక్‌లను ప్రారంభించడం, శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగానికి పెద్ద పీట వేశాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మద్దిల గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, టీబీ నియంత్రణాధికారి అరుణ సులోచనదేవి, డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




వర్చువల్లో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ - శిలా ఫలకం ఆవిష్కరణలో అధికారులు

తిరుపతిలో షార్ట్‌సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధం

● రూ.కోటి మేర నష్టం


దగ్ధమవుతున్న దుకాణం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రేగిన మంటలతో తిరుపతిలో రెండంతస్తుల చెప్పుల దుకాణం పూర్తిగా కాలిపోయింది. తిరుపతి జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతికి చెందిన బద్రీనాథ్ వీవీ మహల్ రోడ్డులో సేవా కలెక్షన్స్ పేరిట ఓ చెప్పుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో చెప్పుల దుకాణం, మొదటి అంతస్తులో గోడౌన్, రెండో అంతస్తులో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. మూడో అంతస్తులో చిన్న గది ఉంది. ఆదివారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణం నుంచి పెద్దఎత్తున పొగలు వ్యాపించాయి. రెండో అంతస్తులోని యజమానులు కిందకు దిగి చూసేందుకు ప్రయత్నించగా దట్టంగా పొగలు వ్యాపించడంతో ప్రమాదాన్ని గ్రహించారు. తక్షణం కుటుంబ సభ్యులందరూ మిద్దెమీదకు చేరుకుని పక్క భవనాలపైనుంచి వెనుక ప్రాంతంలోని మరో భవనంపైకి చేరుకుని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈలోపు మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణంతోపాటు మొదటి అంతస్తులోని గోడౌన్‌లోని సరుకు కాలిపోయింది. రెండో అంతస్తులోకి పొగలు వ్యాపించి గృహోపకరణాలన్నీ నల్లగా మాడిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు తిరుపతి జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు అగ్నిమాపక శకటాలతో సుమారు రెండు గంటలకుపైగా కష్టపడి మంటలను అదుపుచేశారు. మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా నిరోధించారు. డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సాయం అందించారు. ఈ ప్రమాదం వల్ల కోటి రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపకాధికారి వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడమాలపేటలో జడ్పీటీసీ జోరు!

అధికారులు కూడా లేకుండానే మూడు ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవం


పత్తిపుత్తూరులో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న మురళీధర రెడ్డి

వడమాలపేట, ఫిబ్రవరి 25 : నగరి నియోజకవర్గంలో వైసీపీ అసమ్మతి నేతల జోరు తగ్గడం లేదు. వడమాలపేట మండలంలో నిర్మించిన మూడు ప్రభుత్వ భవనాలను జడ్పీటీసీ సభ్యుడు మురళీధర రెడ్డి ఆదివారం ప్రారంభించేయడమే ఇందుకు నిదర్శనం.అప్పలాయగుంటలో సచివాలయం, పత్తిపుత్తూరులో రైతు భరోసా కేంద్రం, అయ్యన్నగారిపల్లిలో జగనన్న పాలవెల్లువ కేంద్ర భవనాలను జడ్పీటీసీ సభ్యుడు మురళీధర రెడ్డి ఒక్కరే ప్రారంభించేయడం చర్చనీయాంశంగా మారింది. ముందస్తు సమాచారం లేకుండా మంత్రి రోజా నియోజకవర్గ పరిధిలో అసమ్మతి నాయకుడు ఒకే పర్యాయం మూడు ప్రభుత్వ భవనాలను ప్రారంభించడం, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం. పైగా శిలా ఫలకాలు ఏర్పాటు చేసి మరీ అనుచరులతో కలిసి ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా జడ్పీటీసీ మురళీధర రెడ్డి మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన జిల్లా పరిషత్ సభ్యుడి హోదాలో తానే ప్రారంభోత్సవాలు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో సుజాతమ్మను ఈ విషయమై వివరణ కోరగా తాను గ్రూప్- 2 పరీక్ష విధుల్లో ఉన్నానని, ప్రభుత్వ కార్యాలయ భవనాల ప్రారంభ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

భార్యపై భర్త దాడి

పీలేరు, ఫిబ్రవరి 25: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త నిద్రిస్తున్న ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన ఆదివారం పీలేరులో జరిగింది. పీలేరు పోలీసుల కథనం మేరకు పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ జంగంపల్లెకు చెందిన గురవయ్య(35), అనితలకు 11 ఏళ్ల క్రితం వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. తాపీమేస్త్రీగా జీవనం సాగించే గురవయ్య, గత కొంత కాలంగా భార్యపై అనుమానం పెంచుకుని ఆమెతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం భార్యపై గొడవ పడి పోలీసు స్టేషన్‌లో పంచాయతీ జరిగింది. అయితే కోపం చల్లారని అతను ఆదివారం ఉదయం 4గంటల సమయంలో ఇంటిలో నిద్రిస్తున్న అనితపై కొడవలితో దాడి చేసి విచక్షణారహితంగా ఆమెను నరికివేశాడు. తల్లి అరుపులతో మేల్కొన్న పిల్లలు అర్చన(13), వంశీ(10) తండ్రిని అడ్డుకోబోయారు. ఉన్మాదంలో ఉన్న అతను వారిపై కూడా దాడికి ప్రయత్నించడంతో వారు తలుపులు తీసుకుని బయటకు వచ్చి జరిగిన విషయాన్ని ఇరుగుపొరుగు వారికి చెప్పారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే గురవయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు అనితను హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలపై తీవ్ర గాయాలు కావడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం అనిత తిరుపతి రుయా ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతోంది.

వివాహిత ఆత్మహత్య


లక్ష్మి (ఫైల్‌ఫొటో)

పీలేరు, ఫిబ్రవరి 25: పీలేరు పట్టణం బండ్లవంక ప్రాంతానికి చెందిన పి.లక్ష్మి(18) అనే వివాహిత ఆదివారం తన ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సెంట్రింగ్ పని చేసే ఆమె భర్త మహేశ్ రోజులాగే పనికి వెళ్లి మధ్యాహ్న భోజన సమయంలో భార్యకు ఫోను చేశాడు. ఆమెకు ఎంతకీ ఫోను తీయకపోవడంతో తమ ఇంటి పక్కనున్న వారికి ఫోను చేసి తమ ఇంటికి వెళ్లి భార్యకు ఫోను ఇమ్మన్నాడు. ఇంటికి వెళ్లిన వారికి లక్ష్మి ఫ్యాను వేలాడుతూ కనిపించడంతో వారు ఆ విషయాన్ని మహేశ్‌కు తెలుపడంతో అతను హుటాహుటిన ఇంటికి చేరుకుని ఆమెను కిందకు దింపి పీలేరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మి, మహేశ్‌లకు ఏడు నెలల క్రితం వివాహమైంది. ఇంతలో ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుందో అర్థం కావడం లేదని ఆమె బంధువులు వాపోయారు.

చలో విజయవాడకు వెళ్లకుండా నోటీసులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 25: ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 27న చలో విజయవాడకు వెళ్లకుండా అడ్డుకొంటూ మదనపల్లె పోలీసుల యూటీఎఫ్ నాయకులకు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం మదనపల్లెలో యూటీఎఫ్ నాయకలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా నాయకులు సుధాకర్‌నాయుడు, పురం వెంకటరమణ, మాట్లాడుతూ ఏపీ జేఏసీ అడిగిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించకపోగా చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి పోలీసులు ద్వారా నోటీసులు జారీ చేయడం, అడ్డుకోవడం దారుణన్నారు.ప్రభుత్వ ఉద్యోగులపట్ల ప్రభుత్వ తీరు ఇలాగే కొనసాగితే పోరాటాలు తప్పవని వారు హెచ్చరించారు.

అభ్యర్థుల ప్రకటనతో వైసీపీలో వణుకు


టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


మాట్లాడుతున్న జనసేన నేత రామాంజనేయులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 25: టీడీపీ-జనసేన కూటమిలోని 99 మంది అభ్యర్థులను ప్రకటించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రకటన వినగానే రాష్ట్రంలో వైసీపీ నాయకుల వెన్నులో వణుకు పుట్టిందని మదనపల్లె టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో గౌతమినగర్, శివాజి నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతానికి చెందిన 150 మంది షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీ చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ కేవలం నియోజకవర్గాలకు సమన్వయకర్తలను మాత్రమే ప్రకటించిందని, ఇప్పుడు టీడీపీ ప్రకటించిన అభ్యర్థులను చూసి సమన్వయ కర్తలను మార్చే ఆలోచనలో ఆ పార్టీ ఉందని ఎద్దేవా చేశారు. మదనపల్లెలో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థే తప్పకుండా గెలుస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఎప్పుడు కూడా పట్టణంలోని కొన్ని ప్రాంతాల సమస్యలు పట్టించుకోలే దన్నారు. అందుకే మూడు ప్రాంతాల ప్రజలు టీడీపీ చేరారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, హరి, నవీన్‌చౌదరి, షంషీర్, నాగూర్‌వలి, పూలకుంట హరి, బాలుతో పాటు నూతనంగా పార్టీలో చేరిన రామాంజనేయులు, ప్రసాద్, శంకర్, మనోహర్, విష్ణు, రమణ, నిజామ్ పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల జాబితా ప్రకటన హర్షణీయం

మదనపల్లె, ఫిబ్రవరి 25: జనసేన-టీడీపీ ఉమ్మడి పార్టీల అధినేతలు పవన్‌కళ్యాణ్, నారా చంద్రబానా యుడులు ఒకే సారి 94 మంది అభ్యర్థుల జాబితా ప్రకటించడం హర్షనీయమని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. బర్మావీధిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఏ పార్టీ కూడా ఒకే సారి ఇంతమంది అభ్యర్థులను ప్రకటించన దాఖలాలు లేవన్నారు. వైసీపీ మాత్రం ఇప్పటికి అయిదుసార్లు జాబితా ప్రకటించినా, 50మందికి మంచి పేర్లు లేవన్నారు. వైసీపీ..తాను ఇప్పటికే ప్రకటించిన వారు కూడా అభ్యర్థులు కాదని, వారంతా సమన్వయకర్తలేనని బాంబు పేల్చడంతో అందరిలోనూ అయోమయం ఏర్పడిందన్నారు. ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థుల చేతుల్లో ఓడిపోతామనే భయం పట్టుకుందన్నారు. మరోసారి వైసీపీకి అవకాశం ఇస్తే..ప్రజలంతా ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవాల్సిందే నని ఎద్దేవా చేశారు. సమావేశంలోఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి దీలు, బోనాలు సమర్పణ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 25: సీటీఎం గ్రామంలో వెలసిన నలవీర గంగాభవానీ అమ్మవారు జాతరలో భాగంగా ఆదివారం వివిధ పల్లెల నుంచి మహిళలు దీలుబోనాలు ఊరేగింపుతరలి వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ జాతర మంగళవారం వరకు అత్యంతవైభవంగా నిర్వహించడానికి ఆలయకమిటీ సభ్యులు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనందపార్థసారధి, వెలుగుచంద్ర, పారపట్ల సురేంద్రరెడ్డి, పోగాకు వీరప్రతాప్‌లు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి తిరుణాలకు వేలాదిమంది భక్తులు జాతరలో పాల్గొంటారు.


కాంగ్రెస్ రాష్ట్ర పునర్‌నిర్మాణ పోరాట సభ

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 24: అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 26న కాంగ్రెస్ రాష్ట్ర పునర్‌నిర్మాణ పోరాట సభను నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ముబారక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం అనంతపురంలో జరిగే సభకు కమిటీ సభ్యులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రైతుల నిరసనకు మద్దతుగా ర్యాలీ


మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 25: రైతుల నిరసనకు మద్దతుగా ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయం నుంచి సబ్‌కలెక్టరేట్ కార్యాలయం వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం రైతుల పంటలకు కనీసమద్దతు ధర ఇచ్చేలా చట్టం చేయాలని, హర్యానా, ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై కాల్పులు జరిపి యువరైతు మరణానికి కారణమైన హర్యానా పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసంహులు, సహాయకార్యదర్శి మహేస్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం సమష్టి కృషి


కిశోర్‌కుమార్ రెడ్డి శుభాకాంక్షలు చెపుతున్న టీడీపీ నాయకులు

కలికిరి, ఫిబ్రవరి 25:టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి గెలుపు కోసం సమష్టిగా కృషి చేస్తామని పీలేరు నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్ పేర్కొన్నారు. టీడీపీ మొదటి జాబితాలో పీలేరు నియోజకవర్గం నుంచి చోటు దక్కించుకున్న నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని దినేష్ ఆధ్వర్యంలో జనసేన శ్రేణులు ఆదివారం నగరిపల్లెలో కలిసి అభినందించారు. కార్యక్రమంలో కలికిరి, కేవీపల్లె మండల జనసేన అధ్యక్షులు అస్లామ్, మహేష్, ఉపాధ్యక్షులు జబీర్, రెడ్డెప్ప, రవి, ప్రధాన కార్యదర్శి షావల్లి, ఇమ్రాన్, వాల్మీకిపురం ఉపాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, తేజ, లోకేష్, కిశోర్, ఎల్లప్ప పాల్గొన్నారు. కాగా జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా చోటు లభించిన కిశోర్‌కుమార్ రెడ్డిని రాజంపేట పార్లమెంటు మదనపల్లె అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి అన్వర్ బాషా అభినందించారు. ఆదివారం నగరిపల్లెలో కిశోర్‌కుమార్ రెడ్డిని కలిసి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు సమష్టి కృషితో గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి విజయమ్మ, గండికోట గణేష్, విద్యాసాగర్‌పాల్గొన్నారు.

కిశోర్‌ను కలసిన మైనార్టీ నేత



మదనపల్లె, ఫిబ్రవరి 25: మదనపల్లె ముస్లింమైనార్టీ నేత, పోతబోలు మాజీ సర్పంచి పఠాన్ ఖాదర్‌ఖాన్, పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలికిరిలోని ఆయన నివాసానికి వెళ్లి ఆదివారం పఠాన్ అభినందించారు.

గుర్రంకొండలో:తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని ఆదివారం గుర్రంకొండ టీడీపీ నాయకులు కలిశారు. పీలేరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మొదటి జాబితాలోనే కిషోర్‌కుమార్‌రెడ్డి పేరును అధిష్టానం ప్రకటించి విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీడీపీ నాయకులు అయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు జగదీష్‌కుమార్, జయసూరి, రెడ్డెప్పరెడ్డి, చంద్రబాబు, ప్రదీప్, జయప్రకాశ్, రామయ్య, ప్రసాద్, ప్రకాశ్, క్రాంతి, నరసింహులు, ధ్వారక, రమణ ఉన్నారు.

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ...

వాల్మీకిపురం, ఫిబ్రవరి 25: వాల్మీకిపురం పట్టణంలోని కొత్తపేటవీధి, జోకపాలెం, జెట్టిపాలెంవీధి తదితర ప్రాంతాలలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి ఆదివారం ఇంటింటా కరపత్రాలు పంచుతూ టీడీపీ జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీలేరు నియోజకవర్గం పార్టీ అభ్యర్థిగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేరును అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ- జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటరమణ, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు చంద్రమౌళి, నారాయణ, రాజేంద్రాచారి, తెలుగు యువత చాను, సయ్యద్‌బాషా, మురళి, డిష్ బ్రదర్స్, సైదు, రామకృష్ణ, బాబు, సాదిక్, యుసూఫ్, జంషీర్, అబ్బాస్, హనీఫ్,మొహ్మద్ ఆలీ, రెడ్డిరామ్, సర్దార్, మౌలా, గోవింద్, రెడ్డిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 25:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించి పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



భారీ మెజార్టీతో జయచంద్రారెడ్డిని గెలిపిస్తాం


జయచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 25: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఆదివారం పలువురు తంబళ్లపల్లె టీడీపీ నాయకులు, కార్యకర్తలు ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో జయచంద్రారెడ్డిని మర్యాదపూర్వ కంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అందరం కలసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో తంబళ్లపల్లెలో టీడీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా మండలంలోని గోపిదిన్నెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చంద్ర ఆధ్వర్యంలో జయచంద్రారెడ్డి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు సాంబశివ, సుబ్రమణ్యం, మ్యూజికల్‌శివ, భాస్కర, జగదీష్, మల్రెడ్డి ఉన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

● టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా


టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డితో మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, ఫిబ్రవరి 25: అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండి....తంబళ్లపల్లె నియోజవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా హామీ ఇచ్చారు. ములకలచెరువు, పాత ములకలచెరువు గ్రామాల్లోని టీడీపీ నేతలు, నాయకులను ఆదివారం టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి కలిశారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా నివాసానికి వెళ్లి కలిశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్ణయమే శిరోధార్యమని, ఆయన ఆదేశాల మేరకు పనిచేయడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. తంబళ్లపల్లె గడ్డపై టీడీపీ జెండా రెపరెపలాడిస్తామన్నారు. ఆరు మండలాల నుంచి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయచంద్రారెడ్డిని కలిశారు. దీంతో రెండోవ రోజు కూడా పార్టీ కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి సమక్షంలో ఆదివారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో వైఘూరికోటకు చెందిన వైసీపీ నాయకులు శేషారెడ్డి అధ్వర్యంలో పలువురు కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

కలిసికట్టుగా పని చేసి టీడీపీ జెండా ఎగురవేద్దాం...


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి తదితరులు

కురబలకోట, ఫిబ్రవరి 25: తంబళ్ళపల్లె నియోజకవర్గంలో గ్రూపులకు తావులేకుండా కలిసికట్టుగా పని చేసి టీడీపీ జెండా ఎగురవేద్దామని టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని అంగళ్ళలో పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు ఎంతో కీలకమనిమని, దాని కోసం ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాలన్నారు. తంబళ్ళపల్లెలో టీడీపీని గెలిపించుకుని అధినేత చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్ర మంలో డీఆర్ వెంకటరమణారెడ్డి, గుడే శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, రామచం ద్ర, మోహన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తెట్టు ఉపసర్పంచ్ బి.భాస్కర్, మధుకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మిన్న. విశ్వనాథ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రరెడ్డితో నేతలు

పెద్దమండ్యంలో: తెలుదేశం పార్టీ గెలుపు కోసం టీడీపీ నేతలు, కార్యకర్తలు పని చేయాలని పెద్దమండ్యం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, సీనియర్ టీడీపీ నేత రామ చంద్రయ్యలు పిలుపునిచ్చారు. ములకల చెరువులోని తంబళ్లపల్లి టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రరెడ్డిని పెద్ద మండ్యం మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి టీడీపీ గెలుపు కోసం సైనికులాగా పని చేస్తామని హామీ ఇచ్చారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, పెద్దమండ్యం మాజీ ఎంపీపీ రజినీదత్, కలిచెర్ల ప్రభాకరరెడ్డి, శ్రీకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, బాబురెడ్డి, దత్తాత్రేయరెడ్డి, మేకల చలపతి, సీతాపతిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

పీలేరు, ఫిబ్రవరి 25: గ్రూప్-2 పరీక్ష పీలేరులో ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ప్రభుత్వం 400 మంది అభ్యర్థులను కేటాయించింది. వారిలో 85 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులను పోలీసులు, కళాశాల అధ్యాపకులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

పరీక్షలకు 1106 మంది హాజరు

కురబలకోట, ఫిబ్రవరి 25: మండలంలోని మిట్స్, విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలకు 1106 మంది విద్యార్థులు హారయ్యారు. ఆదివారం మిట్స్ కళాశాలలో పరీక్షకు 600మందికి గానూ 505మంది, విశ్వం డిగ్రీ కళాశాలలో 505మంది హాజరు కాగా 1194మంది గైర్హాజయ్యారు. పరీక్షా కేంద్రాలను ఆర్డీవో హరిప్రసాద్ ఏసీసీ ఎస్‌సీ బోర్డు మెంబరు సుధాకర్‌రెడ్డిలు తనిఖీ చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.











చంద్రబాబును కలిసేందుకు వెళ్లిన నేతలు

ములకలచెరువు, ఫిబ్రవరి 25: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్‌కు టీడీపీ టికెట్ కేటాయించాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసి కోరేందుకు పార్టీ నేతలు, మద్దతుదారులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఆదివారం సాయంత్రం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. టీడీపీ నేతలు, నాయకులు, బూత్ కమిటీ మెంబర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఏజెంట్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు బయలుదేరి వెళ్లారు.

పెద్దతిప్పసముద్రంలో: తంబళ్లపల్లె టీడీపీ టికెట్ శంకర్‌యాదవ్‌కే కేటాయించాలని కోరుతూ తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా శంకర్ వర్గీయులు బస్సుల్లో విజయవాడకు బయలేదేరి వెళ్లారు. ఆదివారం శంకర్ యాదవ్ స్వగ్రామం పీటీఎం మండలం టి.సదుం గ్రామం నుంచి నియో జకవర్గంలోని ఆరు మండలాల్లో శంకర్ వర్గీయులు విజయవాడకు బయలేదేరి వెళ్లారు.

బి.కొత్తకోటలో: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్‌కు మద్దతుగా పార్టీ నేతలు, ఆయన మద్దతుదారులు ఆదివారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. శంకర్ యాదవ్ అనుచరులు, చంద్రబాబును కలవడానికి ఆదివారం బి కొత్తకోట నుంచి రెండు బస్సులలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పోల్‌మేనేజ్మెంట్ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ శంకర్‌యాదవ్ కు టికెట్ కేటాయించక పోవడం అన్యాయమన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌కు తిరిగి అసెంబ్లీ టికెట్ కేటాయించాలని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శంకర్‌యాదవ్‌కు అసెంబ్లీ టికెట్ కేటాయించాలని అధిష్టానంను కోరడానికి ఆదివారం బస్సుల్లో తంబళ్లపల్లె నుంచి విజయవాడ బయలుదేరి వెళ్లారు. విజయవాడకు వెళ్లిన వారిలో తంబళ్లపల్లె మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిరా యుడు, రాజంపేట పార్లమెంటరీ రైతు ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, తెలుగుయువత నాయకులు నరసింహులు, గంగరాజు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జులు నారాయణ, సుధాకర్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

రామసముద్రం, ఫిబ్రవరి 25: మండలంలోని మట్లవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో 2006-7 సంవత్సరం బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ బ్యాచ్‌కు చెందిన సుమారు 34మంది విద్యార్థులు ఇందులో పాల్గొని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుంటూ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.